క్లుప్తంగా

బాలల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నాగమణి తదితరులు

కె.గంగవరం: ప్రభుత్వాలు బాలల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీపీ వంపన నాగమణి అన్నారు. మండలంలోని కె.గంగవరంలో మంగళవారం కిశోరి వికాసంపై అవగాహన సమావేశం నిర్వహించారు. స్త్రీ శక్తి సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ సమావేశానికి ఎంపీపీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ కిశోరి వికాసం ద్వారా గ్రామ స్థాయిలో బాలలతో గ్రూపులు ఏర్పాటు చేసి బాలలకు చట్టాలు, పరిరక్షణ, వ్యక్తిగత పరిశుభ్రత వంటి వాటిపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. నేటి సమాజంలో బాలల పట్ల వివక్షత తీవ్రరూపం దాల్చిందని బాల్యవివాహాలు, బాలలపై వేధింపులు ఎక్కువవుతున్నాయన్నారు, బాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సీడీపీఓ వీవీ వరాహాలక్ష్మి, ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు, జిల్లా చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, హెచ్ఎం వెంకటేశ్వరరావు, ఏఎస్ఎంలు, మహిళా పోలీసులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు



మీడియాతో మాట్లాడుతున్న రూరల్ సీఐ దొరరాజు

మండపేట: సంక్రాంతి పేరిట కోడి పందేలు నిర్వహిస్తే తాట తీస్తానని రూరల్ సీఐ పీ దొరరాజు హెచ్చరించారు. పట్టణంలోని రూరల్ సర్కిల్ కార్యాలయం నంచి ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ సంక్రాంతి పేరు చెప్పి కోడి పందేలు, గుండాట, పేకాట, జూదం వంటి బోర్డులు వేద్దామని అనుకుంటే వారి భరతం పడతామన్నారు. సర్కిల్ పరిధిలోని ఆలమూరు, కపిలేశ్వరపురం, రాయవరం, మండపేట మండలాల్లోని గ్రామాల్లో ఇలాంటి ఆటలు ఏర్పాటు చేస్తే సహించేది లేదని మరోమారు హెచ్చరించారు. రికార్డింగ్ డాన్సులు, అశ్లీల నృత్యాలు వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు.

పేకాట, కోడిపందాలపై ఉక్కుపాదం



మాచవరం సెంటర్‌లో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై సురేష్‌బాబు

రాయవరం: సంక్రాంతి పండగ పేరుతో గ్రామాల్లో పేకాట, కోడిపందాలు వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాయవరం ఎస్సై డి.సురేష్‌బాబు హెచ్చరించారు. మండలంలోని మాచవరం, కూర్మాపురం గ్రామాల్లో ఆయన మంగళవారం కోడిపందాలు, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించరాదంటూ ప్రజలకు సమావేశాలు నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని మండలంలోని ఆయా గ్రామాల సర్పంచులు, వీఆర్వోలకు నోటీసులు అమలు పరుస్తున్నట్టు ఎస్సై సురేష్‌బాబు తెలిపారు.

హెల్మెట్ ధరించండి

రహదారి ప్రమాదాల్లో ప్రాణనష్టం సంభవించకుండా హెల్మెట్ ధరించాలని ఎస్సై సురేష్ బాబు సూచించారు. మాచవరం సెంటర్‌లో ప్రజలకు హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించారు. మోటార్‌సైకిల్ నడుపుతున్న వారితో పాటు, వెనుక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించాలన్నారు.

ప్లాస్టిక్ రహిత దేవాలయంగా అయినవిల్లి

అయినవిల్లి: ప్లాస్టిక్ రహిత దేవాలయంగా అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయాన్ని తీర్చిదిద్దాలని, అలాగే భక్తులు, ఆలయ సిబ్బంది, గ్రామస్తులు తమ వంతు ప్లాస్టిక్‌ను ఉపయోగించకుండా సహకరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి సూచించారు. మంగళవారం స్థానిక విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో ఆమె వివిధ శాఖాధికారులతో ఆలయ అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. పలు అభివృద్ధి అంశాలపై ఆమె అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ అయినవిల్లి సిద్ధి వినాయక స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆమె ఆదేశించారు. ఆలయ ఆవరణలో ఎలాంటి ప్లాస్టిక్ వస్తువులను, కవర్లను అనుమతించరాదని జేసీ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ నిబంధన ఈనెల 14వ సంక్రాంతి నుంచే అమలు చేయాలని అధికారులకు సూచించారు. భక్తుల సౌకర్యార్థం విఘ్నేశ్వరుని ఆలయ ప్రాంగణంలో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధిస్తున్నామని, అదీ జిల్లాలో మొదట ఈ ఆలయం నుంచే మొదలుపెడుతున్నట్టు ఆమె ప్రకటించారు. జిల్లాలో తొలిసారిగా ఈ విఘ్నేశ్వర స్వామి ఆలయం నుంచే ఈ కార్యక్రమం మొదలు పెడుతున్నామన్నారు. సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం సంక్రాంతి నుంచే అమల్లోకి రానుందన్నారు. ఆలయంలో ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా వేరే బుట్టలు, వస్తువులను వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

- మున్సిపల్ ఛైర్ పర్సన్ దుర్గారాణి
- కోనసీమ క్రీడలు ప్రారంభం



ఆటల పోటీలను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్, వైస్‌ఎంపీపీ



రాయవరంలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ వెంకటరమణ

మండపేట: క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహద పడతాయని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. ప్రభుత్వం చేపట్టిన కోనసీమ క్రీడోత్సవాలు మండపేటలో మంగళవారం ఘనంగా ఆరంభమయ్యాయి. ఏడిద రోడ్డులోని వేగుళ్ల సూర్యారావు ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన కోనసీమ క్రీడలను చైర్‌పర్సన్ దుర్గారాణి, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబులు పాల్గొని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచి క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు. శారీరక దారుఢ్యంతో పాటు ఎదుగుదలకూ ఆటలు ఉపయోగపడతాయన్నారు. ఎంఈవో నాయుడు రామచంద్రరావు, కమిషనర్ రంగారావు, ఎంపీడీవో కే సత్యనారాయణమూర్తిల ఆధ్వర్యంలో జరిగిన క్రీడోత్సవాలలో నాలుగో తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. 12 పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నట్టు రామచంద్రరావు తెలిపారు. కబడ్డీ, కోకో, వాలీబాల్, బ్యాట్మింటన్, క్రికెట్, రన్నింగ్, లాంగ్‌జంప్, త్రోబాల్ తదితర ఆటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ ప్రభుత్వ పాఠశాలల పీడీలు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. సర్పంచ్‌లు వరదా చక్రవర్తి, మట్టపర్తి గోవిందరాజు, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ వీఎన్ ప్రసాద్, ఈవోపీఆర్డీ శ్రీనివాస్, ఎంఈవో సోమిరెడ్డి, మత్స్యశాఖాధికారి విల్ల రమణ, ప్రధానోపాధ్యాయుడు ముంగర వెంకట్రాజు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా కోనసీమ క్రీడోత్సవం ప్రారంభం

రాయవరం: విద్యతో పాటు క్రీడలతోనూ అంతర్జాతీయ స్థాయి గుర్తింపు సాధ్యమని రాయవరం ఎంపీపీ నౌడు వెంకటరమణ, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ వుండవిల్లి రాంబాబులు పిలుపునిచ్చారు. స్థానిక శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి 'కోనసీమ క్రీడోత్సవం-ఆటలతో ఆనందం' క్రీడా పోటీలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం వీఎస్ సునీత అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వెంకటరమణ, రాంబాబు, తహసీల్దారు ఐ.పి.శెట్టి, ఎంపీడీవో కీర్తిస్పందన మాట్లాడారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ రావిరాల మహేష్‌కుమార్ ఆలోచనల ఫలితంగా తొలిసారి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు. సమావేశంలో ఎస్ఎంసీ చైర్మన్ దేవిశెట్టి చిన్ని, ఎంఈవోలు పి.రామలక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణ, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నాగేశ్వరరెడ్డి తదితరులు మాట్లాడుతూ క్రీడల ప్రాధాన్యాన్ని వివరించారు. అనంతరం క్రీడా పోటీలను ప్రారంభించారు. మండలంలోని 48 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల నుంచి సుమారు 200 మంది క్రీడాకారులు అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ, క్రికెట్ తదితర పోటీల్లో పాల్గొన్నారు. ఈ నెల 9వ తేదీ వరకు పోటీలు నిర్వహించనున్నట్టు కోఆర్డినేటర్ కృష్ణప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు నల్లమిల్లి అప్పారెడ్డి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా త్యాగరాజ ఆరాధనోత్సవం



ఆలయంలో కచేరీ చేస్తున్న వాయిద్య కళాకారులు

మండపేట: ఏడిద గ్రామంలో మంగళవారం త్యాగరాజ స్వామి 19వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీసాయిదుర్గ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం, ప్రముఖ వాయిద్య కళాకారుడు వెంటూరి సూర్యనారాయణ ఆధ్వర్యంలో త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు నిర్వహించారు. నాదస్వరం వాయిద్యంలో పేరొందిన కళాకారులు రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చి ఉత్సవంలో పాల్గొన్నారు. తొలుత గ్రామంలోని మోదుకూరు పుంత రోడ్డులో ఉన్న సంజీవని అభయాంజనేయ స్వామివారి ఆలయం వద్ద కొలువు తీరిన త్యాగరాజ మందిరంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని పల్లకిలో గ్రామోత్సవం నిర్వహించారు. యువ పారిశ్రామిక వేత్త వి.సాయికుమార్, గ్రామ ప్రముఖులు బూరిగ ఆశీర్వాదం, పసుమర్తి నాగబాబు, పర్వతిన వీర్రాజు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కాలానుగుణ వ్యాధులపై అవగాహన



అంగరలో మాట్లాడుతున్న అసోసియేషన్ నాయకుడు రాంబాబు

కపిలేశ్వరపురం: ఆధునిక ఆరోగ్య సమాజంలో కాలానుగుణంగా ఉనికిలోకి వస్తున్న వ్యాధులపై పీఎంపీ వైద్యులు పూర్తి అవగాహనతో మెలగాలని కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గంగుమళ్ల రాంబాబు అన్నారు. అంగరలో మంగళవారం శ్రావణి ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్య, విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు బీవీ రమణ, జిల్లా కార్యదర్శి ఎస్.వీరభద్రరావు, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పి.దేవానందం పలు వ్యాధుల ప్రభావాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి పి.చిన్ని, రాజమహేంద్రవరం శాఖ అధ్యక్షుడు రహమాన్‌ఖాన్, కార్యదర్శి మట్టా రమేష్, కోశాధికారి యు.ప్రసాద్‌బాబు. మండల కోశాధికారి ఆర్ఎల్ నారాయణ పాల్గొన్నారు.

మెరుగైన సమాజ నిర్మాణానికి క్రీడా స్ఫూర్తి దోహదం



కపిలేశ్వరంలో క్రీడాకారులతో ప్రజాప్రతినిధులు

కపిలేశ్వరపురం: ఆరోగ్యకరమైన క్రీడా స్ఫూర్తి మెరుగైన సమాజ నిర్మాణానికి దోహదపడుతుందని జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, ఎంపీడీఓ కే రత్నకుమారి, ఎంఈఓ కె.తాతారావు అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో మంగళవారం కోనసీమ క్రీడోత్సవం ఆటల పోటీలు ప్రారంభమయ్యాయి. బాలుర సీనియర్ విభాగంలో వాలీబాల్, కబడ్డీ పోటీల్లో కపిలేశ్వరపురం ఉన్నత పాఠశాల విన్నర్ గానూ, వల్లూరు ఉన్నత పాఠశాల రన్నర్ గానూ నిలిచాయి. కోకో పోటీలో విజేతగా కపిలేశ్వరపురం, రన్నర్‌గా నల్లూరు ఉన్నత పాఠశాల నిలిచాయి. సబ్ జూనియర్స్ 100 మీటర్ల పరుగు పందెంలో నల్లూరు ఉన్నత పాఠశాల విద్యార్థి దేవిశ్రీ చరణ్ ప్రథమ, కపిలేశ్వరపురం ఉన్నత పాఠశాల విద్యార్థి టీ జే రాజు ద్వితీయ, టేకి ఉన్నత పాఠశాల విద్యార్థి తృతీయ స్థానాన్ని సాధించారు. 200 మీటర్ల రన్నింగ్ పోటీలో కపిలేశ్వరపురం ఉన్నత పాఠశాల విద్యార్థి ఎం.సంజయ్ ప్రథమ స్థానాన్ని అంగర ఉన్నత పాఠశాల విద్యార్థి ఎం.సుమంత్ ద్వితీయ, నల్లూరు ఉన్నత పాఠశాల విద్యార్థి జి.దేవి శ్రీ చరణ్ తృతీయ స్థానాన్ని సాధించారు. లాంగ్ జంప్ క్రీడలో అంగర పాఠశాల విద్యార్థి ఎం.గౌతమ్ రాజు ప్రథమ, కపిలేశ్వరపురం పాఠశాల విద్యార్థి బి.శ్రీరామ్ ద్వితీయ, అంగర ఉన్నత పాఠశాల విద్యార్థి సీహెచ్ సుభాష్ తృతీయ స్థానాలను సాధించారు. సీనియర్ షార్ట్‌పుట్ విభాగంలో అంగర విద్యార్థి వి.వినయ్ ప్రథమ, కపిలేశ్వరపురం విద్యార్థి ఎస్.యశ్వంత్ ద్వితీయ, కె.శామ్యూల్ తృతీయ, సీనియర్స్ 100 మీటర్ల పరుగు పందెంలో కపిలేశ్వరపురం విద్యార్థి కే శామ్యూల్ ప్రథమ, టేకి పాఠశాల విద్యార్థి టి.అరుణ్ కుమార్ ద్వితీయ, నల్లూరు విద్యార్థి తృతీయ స్థానాల్లో నిలిచారు. సీనియర్స్ 800 మీటర్ల రన్నింగ్ పోటీలో అంగర విద్యార్థి కె.శ్రీనివాస్ ప్రథమ, కపిలేశ్వరపురం విద్యార్థులు కె.అనూక్ ద్వితీయ, కే శామ్యూల్ తృతీయ స్థానాలను సాధించినారు. మండల పీడీ గుబ్బల వేణుగోపాలరావు, వాసంశెట్టి రవికుమార్, మేకా సత్యనారాయణ, ముత్తా సత్యనారాయణ, దుర్గాప్రసాద్, బేగం న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. హెచ్ ఎం వంగా శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అందరికీ సంపూర్ణ ఆరోగ్యం

- ఆరోగ్యమే మహాభాగ్యం పైలట్ ప్రాజెక్టుకు శ్రీకారం
- మార్చిలోగా కార్యాచరణ అమలు
- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం: సమాజం బాగుండాలంటే అందరికీ సంపూర్ణ ఆరోగ్యం ఉండాలనే స్ఫూర్తితో 'ఆరోగ్యమే మహాభాగ్యం పైలట్ ప్రాజెక్టు'కు శ్రీకారం చుడుతున్నట్లు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. పట్టణంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో వివరాలను మంగళవారం మంత్రి సుభాష్ మీడియా సమావేశంలో వివరించారు. మంత్రి మాట్లాడుతూ నియోజవర్గంలో హెల్దీ హార్ట్ మిషన్ ద్వారా హార్ట్‌అటాక్‌లు నియంత్రించేందుకు కార్యాచరణ రూపొందించామని, ఈ బృహత్తర కార్యక్రమానికి, ప్రముఖ వైద్యుడు కోట సతీష్‌తో పాటు, సీఎస్సార్ నిధులను ఇచ్చేందుకు ఒక ప్రైవేటు కంపెనీ సహకారం తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో భాగంగా తొలుత నియోజకవర్గంలో ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించి, ఆరోగ్యంపై వారిలో చైతన్యం, అవగాహన కల్పిస్తామన్నారు. నేటి ఆధునిక జీవనశైలి, మానసిక ఆందోళన, ఒత్తిడి, మద్యం, ధూమపానం నిర్మూలన తదితర అంశాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తామన్నారు. ఎక్కువగా పురుషులు హృదయ సంబంధ వ్యాధులతోనూ, మహిళలు క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతున్నారని, ఈ వ్యాధులను గుర్తించేందుకు అవసరమైన స్క్రీనింగ్ టెస్టులు అతి తక్కువ నామమాత్రపు రుసుంతో నిర్వహిస్తామన్నారు. ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం వ్యక్తిగత నిధులను కూడా కేటాయిస్తానని మంత్రి సుభాష్ హామీ ఇచ్చారు. రామచంద్రపురంలో రక్తనిధి, అనాథాశ్రయాలు ఏర్పాటు చేసి ఆదుకుంటామన్నారు. ప్రముఖ వైద్యుడు కోట సతీష్ మాట్లాడుతూ రామచంద్రపురం నియోజవర్గ ప్రజలకు మేలు చేయాలని సదుద్దేశంతో మంత్రి సుభాష్ హెల్దీ హార్ట్ మిషన్‌కు ముందుకు రావడం గర్వకారణం అన్నారు. వ్యాధి ప్రారంభ దశలోనే జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి ఒక్కరూ ఏడాదికి ఒకసారైనా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. తొలుత వ్యాధిపై అవగాహన కలిగి ఉండడం, వ్యాధిని గుర్తించడం, వైద్యం అందేలా చేయడం, అత్యవసర పరిస్థితిని ఎదుర్కోవడం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చట్టరీత్యా నేరం

కాజులూరు: సంక్రాంతి పండగ పురస్కరించుకుని గ్రామాల్లో కోడిపందాలు, పేకాటలు, గుండాటలు వంటి జూదాలు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని గొల్లపాలెం పోలీస్‌స్టేషన్ ఎస్సై ఎం.మోహన్‌కుమార్ అన్నారు. మంగళవారం గ్రామంలో ఆయన మాట్లాడుతూ కోడిపందాలు, పేకాటలు, గుండాటలు వంటి జూదాలు నిర్వహించటం చట్టరీత్యా నేరమన్నారు. సంక్రాంతి సందర్భంగా ఎవరైనా రహస్య స్థావరాల్లో కోడిపందాలు నిర్వహిస్తే బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేసి కోర్టుకు తరలిస్తామన్నారు. ఎక్కడైనా పేకాట ఆడుతున్నా, కోడిపందాలు జరుగుతున్నా పోలీసు స్టేషన్‌కు సమాచారమందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు.


ఘనంగా ఆలయ వార్షికోత్సవం



మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని హసన్‌బాదలో వేంచేసియున్న మహాలక్ష్మి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు శ్రీనివాస శర్మ బ్రహ్మత్వంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వయంగా అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించుకున్నారు. కాకినాడకు చెందిన పడవల పూర్ణచంద్రమౌళి, సూర్యకుమారి దంపతులు మహాలక్ష్మి శాంతి హోమం, శ్రీనివాస కల్యాణం నిర్వహించారు. కాకినాడకే చెందిన రుక్మిణి అమ్మవారికి పలు రకాల స్వీట్లతో సారె, మహిళా భక్తులు 300 మందికి పసుపు, కుంకుమలతో చీరలు అందజేశారు. అనంతరం సుమారు 1500 మందికి అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ గొల్లపల్లి పద్మరాజు, దొంతంశెట్టి సత్యప్రకాశ్, బట్ట శ్రీను, కాలెపు గంగాధరం, గోరు సత్యనారాయణ, వీవీఎస్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాశ్, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.


మాచవరం వద్ద రిక్వెస్ట్ స్టాప్ కావాలి



డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో మాట్లాడుతున్న డిపో మేనేజర్ భాస్కరరావు

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం ఆర్టీసీ డిపోలో మంగళవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో 14 మంది ఫోన్ చేసి సమస్యలను తెలియజేసినట్లు డిపో మేనేజర్ పేపకాయల భాస్కరరావు తెలిపారు. రాయవరానికి చెందిన కె.రాంబాబు మాట్లాడుతూ మాచవరం వద్ద ఎక్స్‌ప్రెస్ బస్సులకు రిక్వెస్ట్ స్టాప్ కావాలని కోరగా ప్రస్తుతం అన్ని బస్సులు ఆపడం జరుగుతుందని, ఆపకపోతే తగిన చర్యలు తీసుకుంటామని డీఎం తెలిపారు. మండపేటకు చెందిన ఎంఎస్ దివ్య సాయంత్రం 4.30 గంటలకు వీఎస్ఎం కళాశాల వద్ద బస్సులు ఖాళీగా ఉన్నా కూడా ఆపడం లేదని ఫిర్యాదు చేశారు. తగిన చర్యలు తీసుకుంటామని డీఎం తెలిపారు. రాయవరం మీదుగా రాజమహేంద్రవరం బస్సు సర్వీసును పునరుద్ధరించాలని లొల్లకు చెందిన ఎం.కృష్ణ కోరారు. రామచంద్రపురం నుంచి రాయవరం, పల్లకడియం మీదుగా రాజానగరానికి బస్ సర్వీస్ కావాలని రాయవరానికి చెందిన బి.రాంబాబు కోరారు. రామచంద్రపురం నుంచి మాచవరం, బలభద్రపురం మీదుగా సామర్లకోట బస్సు నడపాలని వెదురుపాకకు చెందిన వడ్డాది శ్రీరామచంద్ర కోరారు. వెదురుపాక నుంచి రాజమహేంద్రవరానికి బస్ సర్వీస్ కావాలని వెదురుపాక సావరానికి చెందిన ఎస్వీ రమేష్‌కుమార్ కోరారు. చెల్లూరుకు చెందిన బి.శ్రీను వాకతిప్ప నుంచి చెల్లూరు మీదుగా కాకినాడకు రాత్రి 10 గంటలకు బస్సు కావాలని కోరారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరిస్తామని డీఎం భాస్కరరావు తెలిపారు. రామచంద్రపురానికి చెందిన వీవీ భాస్కరరావు రామచంద్రపురం నుంచి గండేపల్లి బస్సు పునరుద్ధరించాలని కోరగా రోడ్ల మరమ్మతుల కారణంగా ఆపినట్లు రోడ్ల మరమ్మతులు పూర్తయిన తరువాత పునరుద్ధరించడం జరుగుతుందన్నారు. లొల్లకు చెందిన ఎం.కృష్ణ రాయవరం మీదుగా రాజమహేంద్రవరం బస్ సర్వీస్ పునరుద్ధరించాలని కోరగా గతంలో తగినంత మంది సర్వీస్‌ను ఉపయోగించుకోని కారణంగా రద్దు చేశామని పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

ప్రణాళికతో చదివితే విజయం సొంతం



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎంపీడీవో కీర్తిస్పందన

రాయవరం: విద్యార్థినులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని, ప్రణాళికతో చదివితే విజయాలు సొంతమవుతాయని ఎంపీడీవో కీర్తిస్పందన విద్యార్థినులకు పిలుపునిచ్చారు. రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులకు మంగళవారం ప్రత్యేకంగా మోటివేషన్ క్లాస్‌ని నిర్వహించారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డీవీవీ నాగేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీడీవో కీర్తిస్పందన మాట్లాడుతూ విద్యార్థినులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. మీలో ఉండే ఆత్మవిశ్వాసం, మీ శక్తి, మీరు పడ్డ కష్టం మాత్రమే మీ విజయాలకు పునాదిగా నిలుస్తాయన్నారు. గెలిచే వరకు ప్రయత్నించే పట్టుదల మీ వద్ద ఉందన్న సంకేతాన్ని సమాజానికి ఇవ్వాలన్నారు. వెనక్కి లాగే వాళ్ల మాటలు పట్టించుకోకుండా, గమ్యం వైపు సాగిపోవాలన్నారు. ఎంపీపీ నౌడు వెంకటరమణ, గ్రామాభివృద్ధి కమిటీ ఛైర్మన్ వుండవిల్లి రాంబాబు, ఉన్నత పాఠశాల హెచ్ఎం వీఎస్ సునీత తదితరులు స్ఫూర్తిదాయకమైన వారి జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

పంటల బీమా ప్రీమియం చెల్లించకపోవడం అన్యాయం

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- వాడీవేడిగా కపిలేశ్వరపురం మండల సమావేశం
- సమస్యలు ఏకరవు పెట్టిన సభ్యులు



అధికారులను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం: కూటమి ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తోందని, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పంటల బీమా ప్రీమియంను ప్రభుత్వమే చెల్లించిందని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి అధ్యక్షతన పరిషత్ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ కె.రత్నకుమారి సమావేశ అజెండాను ప్రవేశపెట్టారు. దీనిపై సభ్యులు క్షేత్ర స్థాయి పరిశీలనతో ప్రశ్నలు సంధించారు. ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ ఎమ్మెల్సీ తోట, సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక అధికారులు నీళ్లు నమిలారు. సమావేశానికి సకాలంలో హాజరుకాని వారిపై నిబంధనలు మేరకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ తోట ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 7 నెలలు గడిచినా ప్రజలకు ఇచ్చిన హామీల ఊసు ఎత్తడంలేదని ఎమ్మెల్సీ ఎద్దేవా చేశారు. నిడసనమెట్ట గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో అమర్చిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించడంపై జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు ఆగ్రహం వ్యక్తం చేశారు. జగనన్న కాలనీలో నివాసితులకు విద్యుత్ సదుపాయం కల్పించడంలో జాప్యం జరుగుతుందని సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఉచిత ఇసుక విధానం అమలు అక్రమాలకు నెలవుగా మారిందని ఎంపీటీసీ పలివెల మధు అన్నారు. హెచ్ఎంపీవీ వైరస్ ప్రభావాలపై ప్రజలు భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదని వైద్యాధికారులు సభలో వివరణ ఇచ్చారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు సాకా శ్రీనివాస్, గుణ్ణం భాను ప్రసాద్, మండల ప్రత్యేకాధికారి కామేశ్వరరావు, తహసీల్దార్ చిన్నారావు, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ రాజేంద్ర ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.